విచారణలపై అవగాహన అవసరం

సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి



పేట్‌బషీరాబద్ పీఎస్‌ను సందర్శించిన అవినాష్ మహంతి

కుత్బుల్లాపూర్: కానిస్టేబుల్ స్థాయి నుంచిపైఅధికారి వరకు కేసుల ఇన్వెస్టిగేషన్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలోని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8:30 గంటల వరకు సిబ్బందితో కేసుల వివరాలతోపాటు వాటి ఇన్వెస్టిగేషన్ పనితీరుపై ఆరా తీశారు. ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లను పలకరిస్తూ ఇప్పటివరకు ఎన్ని కేసులను ఇన్వెస్టిగేషన్ చేశారని ఆరా తీశారు. వారికి మరిన్ని కేసులను చూసే బాధ్యత ఇవ్వాలని సీఐ విజయవర్ధన్‌ను ఆదేశించారు. యాప్స్ విషయమై కొంతమంది సిబ్బంది తడబాటుకు గురికాగా, పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని చెప్పారు. అంతకుముందు మేడ్చల్ డీసీపీ కార్యాలయం సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించి ఇక్కడ అన్ని శాఖలకు అనువుగా ఉండేలా భారీ బిల్డింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని డీసీపీ కోటిరెడ్డికి సూచించారు.

బస్సుల్లో వృద్ధుల రాయితీకి కృషి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్

కుత్బుల్లాపూర్: వృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో రాయితీ కల్పించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీ ప్రయాణాల్లో వృద్ధులకు రాయితీ కల్పిస్తున్నాయని, తెలంగాణలో సైతం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి మురళీగౌడ్, ఉపాధ్యక్షులు లింగంగౌడ్, సభ్యులు నాగేష్, వీరారెడ్డి, శివశంకర్ తదితరులు ఉన్నారు.

మహిళాసమాఖ్య సభ్యులకు శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన ఇందిరారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన వివేకానంద్ కలిసి కట్టుగా సమాఖ్య అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షురాలు పద్మాగౌడ్, కార్యదర్శి సత్యవాణి, సంయుక్త కార్యదర్శి ఖుర్షీదా, కోశాధికారి శ్యామల, డైరెక్టర్లు అనిత, ఎం.పద్మ, ఆసియా, లావణ్య, కల్పన, లలిత, మంగ, సభ్యులు ఉన్నారు.

అమ్మవారి కల్యాణ మహోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న శ్రీశైలంయాదవ్, కవిత దంపతులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శ్రీపోచమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం గురువారం కనులపండుగలా జరిగింది. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, సన్న కవిత దంపతుల చేతుల మీదుగా అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం జరగబోయే బోనాల పండుగకు ముందుగా అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించడం ఆనాయితీగా వస్తోందని శ్రీశైలంయాదవ్ పేర్కొన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండేలా పోచమ్మ తల్లి దీవించాలని కోరుకున్నట్లు కవిత తెలిపారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



మైసమ్మనగర్‌లో జరిగిన బొడ్రాయి పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మ నగర్‌లో గురువారం బొడ్రాయి పండుగ ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి రవీందర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌చారి, పిల్లి ఆంజనేయులు, వేణుగౌడ్, కళ్యాణ్, మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రగతినగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బడ్జెట్‌లో విద్యకు మొండిచేయి: ఎస్ఎఫ్ఐ

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. ఈ అన్యాయన్ని నిరసిస్తూ గురువారం ప్రగతినగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ. 21,389 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 21,292 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ప్రభుత్వ పాఠశాలలను మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని పేర్కొందని, ఈ బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించారని, ఇందులో మహిళా యూనివర్సిటీ రూ.200 కోట్లు పోగా, మిగిలిన రూ.300 కోట్లు అన్ని వర్సిటీలకు ఎట్లా సరిపోతాయని మండిపడ్డారు. అనంతరం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో గురుకులాలను విస్మరించారని, ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ అరుణ్, వంశీ, మనోజ్, జిల్లా కమిటీ సభ్యులు భగత్,శ్యామ్, శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, సుబ్బు, నిఖిల్, రాహుల్, ప్రణయ్, అజయ్, నవీన్, వాసు, రమ్య, కీర్తన, రేణుక, సుష్మ, సురేఖ, లావణ్య,యమునా పాల్గొన్నారు.

వైద్యాధికారులు కదిలారు..

పేట్ బషీరాబాద్ ప్రాంతంలో వైద్యశిబిరం ఏర్పాటు

కుత్బుల్లాపూర్: వైద్య అధికారులు కదిలారు.. వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు డెంగీలక్షణాలు ఉన్నాయనే విషయమై ఈ నెల 23న సాక్షిలో ‘ఐదుగురు చిన్నారులకు డెంగీ లక్షణాలు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పల్లె దవాఖానా వైద్యురాలు లలిత ఆధ్వర్యంలో పేట్ బషీరాబాద్ ప్రాంతంలోని హర్ష ఆసుపత్రి ఆవరణలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 58 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలిత మాట్లాడుతూ ప్రతీవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా అంగడిపేట్ ప్రైమరీ స్కూల్లోని 88 మంది విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేశారు.

నోట్‌పుస్తకాల పంపిణీ



మోతీనగర్: కబీర్‌నగర్‌కు చెందిన రమేష్ అయ్యంగార్ శివ రామాంజనేయ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, షూ సాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాతల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తూము వేణు, రాఘవేంద్ర, సతీష్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, బుచ్చన్న, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

పగలూ రాత్రీ.. పొగలు.. దిగులు

కాలుష్య కారక పరిశ్రమలకు అడ్డాగా ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ

- పట్టించుకోని ఐలా, పీసీబీ అధికారులు
- అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు



రాత్రిపూట ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ నుండి వెలువడుతున్న పొగలు

జీడిమెట్ల: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడంపై ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తుంటే కొన్ని పరిశ్రమలకు ఇవేమీ పట్టడంలేదు. నిబంధనలను తుంగలో తొక్కి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. జీడిమెట్లలోని ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోకి ఎవరైనా వచ్చి చూస్తే కాలుష్యం ఎంత పెద్ద ఎత్తున వెలువడుతుందో అర్థం అవుతుంది. ఇప్పటికైనా కాలుష్య కారక పరిశ్రమలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మమ్మల్ని ఎవరేమీ చేయలేరు..

ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో ఉన్న కొన్ని పరిశ్రమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పొగలను జనాల్లోకి వదులుతున్నాయి. పరిశ్రమల లోపల నల్లటి ఆయిల్‌ను మరిగించి వేడి చేసిన ఇనుప సామాన్లను అందులో ముంచుతారు. ఆయిల్‌ను మరిగించే క్రమంలో భరించలేని దుర్వాసన, పొగలు వెలువడుతున్నాయి. ఇదేంటని ఎవరైనా పరిశ్రమవారిని ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. అంటూ నిర్లక్ష్యంగా బదులిస్తున్నారు.

అమ్యామ్యాలు తీసుకుని మిన్నకుండి...

జీడిమెట్ల ఎస్వీ కోఆపరేటీవ్ సొసైటీలో ఉన్న ఓ ఐలా అధికారి ప్రతినెలా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల నుంచి అమ్యామ్యాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది సైతం వీరివద్ద నుంచి ప్రతినెలా ముడుపులు తీసుకుంటున్నట్లు పరిశ్రమల సిబ్బంది చెబుతున్నారు. కాలుష్యాన్ని అడ్డుకోవాల్సిన వారే కాసులకు కక్కుర్తి పడితే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిశ్రమలపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు అంటున్నారు.



పరిశ్రమలో ఉన్న నల్లటి అయిల్ డ్రమ్ములు

దుర్వాసన.. కళ్ల మంటలు



మేం 12 ఏళ్లుగా సుభాష్ నగర్‌లో ఉంటున్నాం. మా కాలనీకి ఆనుకుని ఉన్న ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని కొన్ని పరిశ్రమలు పగలు, రాత్రి తేడా లేకుండా పొగలను వదులుతున్నారు. దీంతో మాకు తీవ్రమైన దుర్వాసనతోపాటు కళ్లమంటలు వస్తున్నాయి. ఇప్పటికైనా పీసీబీ అధికారులు పట్టించుకోకపోతే ప్రజావాణిలో నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, సుభాష్‌నగర్

చర్యలు తీసుకుంటాం..



త్వరలోనే ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో పర్యటిస్తాం. గతంలో కాలుష్యానికి పాల్పడే పరిశ్రమలకు నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించాం. త్వరలోనే ఎస్వీ కో ఆపరేటీవ్ సొసైటీలో పర్యటించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, మేడ్చల్ జిల్లా పీసీబీ ఈఈ

శిథిలావస్థలో క్యాష్ కౌంటర్



చింతల్: సకాలంలో నీటిబిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న అధికారులు బిల్లులు చెల్లించేందుకు వచ్చిన వినియోగదారులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో నీటి బిల్లులు చెల్లించుకునే కేంద్రం(క్యాష్ కౌంటర్) శిథిలావస్థకు చేరింది. దీనికి మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.2 లక్షలతో పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు ప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా నేటికీ పూర్తికాలేదు. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా రోజూ కార్యాలయానికి రావడం తాపీగా వెళ్లిపోవడం షరామామూలుగా మారిందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పునర్నిర్మాణ పనులకు రెండునెలలు గడిస్తే కొత్త భవననిర్మాణానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజు నీటిబిల్లులు చెల్లించేందుకు కార్యాలయానికి రావడం, నిరాశతో వెనక్కి వెళ్లడం వినియోగదారులకు షరామాములుగా మారింది. ఉదయం వేళల్లో ఒక సెక్షన్ కార్యాలయంలో క్యాష్ కౌంటర్ ఏర్పాటు చేసినప్పటికీ వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో వారు వెనక్కి తిరిగి వెళ్తున్నారు.

ఫోర్జరీ పత్రాలు సృష్టించిన ఇద్దరి రిమాండ్



నిందితులు సరాయి కృష్ణ, కమ్మరి కుమార్

నిజాంపేట్: ఫోర్జరీ పత్రాలు సృష్టించిఓ మహిళకు చెందిన స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్న ఇద్దరు నిందితులను బాచుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాగిశెట్టి జయశ్రీ అనే మహిళకు ప్రగతినగర్‌లోని వాసవీ లేఅవుట్ సెక్టార్-4లోని సర్వే నెంబరు 169పి, 182పి, 159పిల పరిధిలో ప్లాట్ నెంబరు 135 కింద 244.44 గజాల స్థలం ఉంది. సదరు స్థలంపై కన్నేసిన సరాయి కృష్ణ, కుమ్మరి కుమార్ తమకు తెలిసిన సుబ్బారావు, మరో మహిళతో కలిసి తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ పేర్లపై రిజిస్టర్ చేసుకున్నారు. ఈ విషయంపై బాధితురాలు జయశ్రీ బాచుపల్లి పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సరాయి కృష్ణ, కమ్మరి కుమార్ తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించినట్లు నిర్ధారించి అరెస్టు చేశారు. గురువారం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది.



కొంపల్లి- దూలపల్లి చౌరస్తాలో డివైడర్ మధ్య ప్రమాదకరంగా ఉన్న ఇనుప ఊచలు

వామ్మో... డివై‘డర్’!

కుత్బుల్లాపూర్: కొంపల్లి చౌరస్తా– దూలపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన డివైడర్ పనులను కాంట్రాక్టర్ రెండు నెలలుగా ఎక్కడికక్కడే నిలిపివేయడంతో వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ శివాజీరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి సతీష్ సాగర్ నిలిచిపోయిన పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు మధ్యలో డివైడర్ కోసం ఏర్పాటు చేసిన ఇనుప ఊచలను అలాగే వదిలివేశారని, వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రాణాంతకంగా మారాయని అన్నారు. వాహనాలు జారిపడి ఇనుప కడ్డీలపై పడితే వారి ప్రాణాలకే ప్రమాదమని అంటున్నారు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత స్పందించడం వల్ల ప్రయోజనం ఉండదని, హెచ్ఎండీఏ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో అన్నివర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: అన్నివర్గాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర బడ్జెట్‌కు రూపకల్పన చేశారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో శ్రీశైలంగౌడ్ విలేకరులతో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్ జనరంజకంగా ఉందని, బడ్జెట్‌లో హైదరాబాద్ నగర అభివృద్ధికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించడం హర్షణీయమన్నారు. ఆరు గ్యారంటీల అమలుతోపాటు, పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఈ బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. ప్రజా సంక్షేమంతోపాటు రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ధన్యవాదాలు తెలుపుతున్నానని శ్రీశైలంగౌడ్ అన్నారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. డివైడర్‌కు ఢీకొని..



ఫుడ్ డెలివరీ బాయ్‌కు ప్రాథమిక చికిత్స చేస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి

కుత్బుల్లాపూర్: రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ వాహనదారుడు పోలీసులను చూసి తప్పించుకోవాలనుకున్నాడు.. ఇదే క్రమంలో పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొని కింద పడ్డాడు.. ఇంతలో అక్కడే ఉన్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి గుర్తించి అతడికి ప్రాథమిక చికిత్స చేశారు. సుచిత్ర చౌరస్తా వద్ద బుధవారం రాత్రి రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను ఆపి అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో అటుగా రాంగ్ రూట్‌లో వచ్చిన జొమోటో డెలివరీ బాయ్ అనంత పూర్ణారావు తన ద్విచక్ర వాహనాన్ని వెనక్కి తీసుకునే క్రమంలో కింద పడిపోయాడు. అతని కాలుకు దెబ్బ తగలడంతో ఏసీపీ ప్రాథమిక చికిత్స చేయడం విశేషం. వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

బోనాల ఏర్పాట్లను పూర్తి చేయాలి

మోతీనగర్: బోనాల సందర్భంగా ఆలయాల వద్ద ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ కోరారు. గురువారం మూసాపేట డివిజన్ పరిధిలోని బబ్బుగూడ నల్లపోచమ్మ దేవాలయం వద్ద స్థానిక నాయకులతో కలిసి బోనాల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న బోనాల పండుగ జరుగనున్నట్లు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోడ శ్రీనివాసరావు, నాయకులు శ్రీధర్‌గౌడ్ స్వామి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు రండి!

మేయర్ కొలన్ నీలారెడ్డికి ఆహ్వానం



మేయర్ కొలన్ నీలారెడ్డిని కలిసిన ఆలయకమిటీల సభ్యులు

నిజాంపేట్: నిజాంపేటలో బోనాల పండుగను వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్, బాచుపల్లి సాయినగర్, రాజీవ్‌గృహకల్ప కాలనీలకు చెందిన ఆలయ కమిటీ సభ్యులు ఈ నెల 28న జరిగే బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ మేయర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆలయాల్లో బోనాల వేడుకలు నిర్వహించడానికి ఆలయ కమిటీలకు ప్రత్యేక నిధులను విడుదల చేసిందని, ఉత్సవాలను ఘనంగా నిర్వంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల జగదీష్ యాదవ్, నాగరాజ్ యాదవ్, భైండ్ల నగేశ్ తదితరులు ఉన్నారు.

రహదారులు బురదమయం



బాలయ్యనగర్‌లో బురదమయంగా రోడ్డు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకురోడ్లు బురదమయంగా మారాయి. స్థానికంగా కొన్నిచోట్ల సీసీ రోడ్లు లేకపోవడంతో చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారిపోతున్నాయి. ఇప్పటికే తమ బస్తీలోకి భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైపు లైన్లు వచ్చాయని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని బాలయ్య నగర్ వాసులు కోరుతున్నారు.

మంచినీటి అక్రమ కనెక్షన్లు తొలగించాలి



వాటర్‌వర్క్స్ డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: మంచినీటి అక్రమ కనెక్షన్లు తొలగించాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ కోరారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వాటర్ వర్క్స్ డీజీఎం నాగ ప్రియకు వినతిపత్రం అందజేశారు. ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్, ఎన్‌టీఆర్‌నగర్, దత్తాత్రేయ కాలనీ తదితర కాలనీల్లో నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అక్రమ కనెక్షన్లను తొలగించి సరిపడా నీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, నాయకులు కేశవరావు, రాజు, శ్రీనివాస్, రఘు, శివాజీ, కవిత, అనిత, సురేష్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు బోనాల ఆహ్వానం అందజేత



ఎమ్మెల్యేతో అసోసియేషన్ నాయకులు

మోతీనగర్: మోతీనగర్‌లోని వి. రామారావునగర్‌బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నె 28న బోనాల పండుగను నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి గురువారం బోనాల పండుగకు హాజరవ్వాలని ఆహ్వానాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఎస్. సత్యం, రఘుపతి, సాంబశివ,రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా పాలనకు ఆకర్షితులై చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వాన్ని చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో సురేష్, గణేష్, సాయి, సైదులు, సందీప్, బండ సాయి, చందు, మనోజ్, శ్రీనివాస్, విజయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కదిరె కృష్ణపై ఫిర్యాదు

మోతీనగర్: హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరె కృష్ణపై అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. మళ్లీ అనుచిత వ్యాఖ్యలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్. వెంకట్రాంరెడ్డి, జి. సుదర్శన్, అమ్రేష్ రాజ్, కురుమ బాబు, యాదగిరి, మల్లేష్, కేవీ రాజు తదితరులు పాల్గొన్నారు.